మన చౌరాస్తా

తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 241 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | గురువారం, 06 ఆగస్టు 2026 | పేజీలు :4




## సైబర్ నేరాల నివారణలో భాగస్వాములు కావాలి

- మహబూబాబాద్ ఎస్పీ శబరీష్

3



## ప్రత్యామ్నాయ పంటలు రైతుకు లాభదాయకం

- దేవరుప్పులలో పంటలు పరిశీలించిన కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

2



# ఇక డయల్ 112

- పోలీస్, ఫైర్, అంబులెన్స్‌కు ఇక ఒక్కటే నంబర్
- సేవలను ప్రారంభించిన డీజీపీ సి.వి ఆనంద్

**హైదరాబాద్, మన చౌరాస్తా :** తెలంగాణలో డయల్ 112 సేవలు అందుబాటగులోకి వచ్చాయి. ఏ ఫిర్యాదుకైనా ఇక 112 ద్వారా సమాధానం వస్తుంది. రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ.. డయల్ 112 ద్వారా 18 రకాల సేవలు అందుబాటులోకి వస్తాయని వెల్లడించారు. న్యాయసాయం, వైద్యసాయం, సైబర్‌సాయం అనేక సమస్యల పరిష్కారాలకు డయల్ 112 పరిష్కార మార్గమని వ్యాఖ్యానించారు. డయల్ 112కు ఫోన్ చేసినప్పుడు పోలీసులు దానిని ఎట్టి పరిస్థితుల్లోనూ తిరస్కరించడానికి వీల్లేదని స్పష్టం చేశారు. ఒకే వ్యవస్థలోకి పోలీస్, ఫైర్, అంబులెన్స్ సేవలు, టిజిఐసిసి నుంచి డయల్ 112 సేవలను పర్యవేక్షిస్తామని డీజీపీ తెలిపారు. ప్రజల భద్రత, అత్యవసర స్పందన సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేయడమే తమ లక్ష్యమని వెల్లడించారు. డయల్ 112 ఫోన్ రాగానే కాలర్ లొకేషన్ కోసం అడ్వాన్స్ ఆల్స్ వాడుతున్నామని పేర్కొన్నారు. డ్రోన్ బెస్ట్ టెక్నికల్ సిస్టంను త్వరలోనే తెలంగాణ పోలీసులు ఉపయోగిస్తారని వివరించారు. డ్రోన్ టీమ్‌ను సైతం ఏర్పాటు చేయబోతున్నామని చెప్పుకొచ్చారు. డయల్ 112 అనేది 3.0 వర్షన్‌గా ఉంటుందని తెలిపారు. యువ ఏపీఎస్‌లు, ఏఐ టెక్నాలజీ వాడే వారిని ఇందులో భాగస్వామ్యం చేయబోతున్నామని డీజీపీ ఆనంద్ పేర్కొన్నారు. బేసిక్ పోలీసింగ్ లాగా టెక్నాలజీ పోలీసింగ్‌ను అమల్లోకి తీసుకువస్తున్నామని వ్యాఖ్యానించారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ టవర్‌లో రెండు ఫ్లోర్‌లను డయల్ 112కి కేటాయించామని తెలిపారు. డయల్ 100ను 2013లో కొంపల్లిలో జివికె వారి సాయంతో ప్రారంభించామని ప్రస్తావించారు. వివిధ అత్యవసరాలకు ఒకే నంబర్ ఉండాలని గతంలో కేంద్రప్రభుత్వం సూచించిందని వెల్లడించారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత టెక్నికల్ డెవలప్‌మెంట్ చేస్తూ వచ్చామని అన్నారు. ఇటీవల ఏఐ వచ్చాక అనేక పనులు సులువుగా అయిపోతున్నాయని డీజీపీ ఆనంద్ వెల్లడించారు.





wanted

విలేకరులు కావలెను



మన చౌరాస్తా తెలుగు దినపత్రిక స్థాపించిన అనతి కాలంలోనే పాఠకుల విశేష ఆదరణ పొందుతూ డిజిటల్ మీడియా రంగంలో దూసుకెళ్తోంది. స్థానిక సమస్యలపై, రాజకీయ, ఎడ్యుకేషన్, ఆరోగ్యం, సినిమా వార్తలు అందిస్తూ అందరి మన్ననలు పొందుతూ ముందుకు సాగుతోంది. మా పత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, మండల రిపోర్టర్లు కావలెను.. పూర్తి వివరాలకు ఈ కింది నంబర్లలో సంప్రదించగలరు.

manachourasta@gmail.com

8555800812 9676400812

సామాన్యుడి గొంతుగా.. సామాజిక సమర వేదికగా..

మన చౌరాస్తా

The Complete News way





# పీజీఐడీ సూచీలో జాతీయ స్థాయిలో జనగామను అగ్రస్థానంలో నిలపాలి

## కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**జనగామ, మన చౌరాస్తా :** పర్ఫార్మెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్ ఫర్ డిస్ట్రిక్ట్స్ (PGID) సూచీలో ఉన్న విద్యా సూచికలపై ప్రత్యేక దృష్టి సారించి, జనగామ జిల్లాను జాతీయ స్థాయిలో అగ్రస్థానంలో నిలిపేందుకు అధికారులు సమన్వయంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్, విద్యా శాఖ అధికారి సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. బుధవారం జిల్లా సమీకృత కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన 'మిషన్ శిఖరం' సమీక్ష సమావేశంలో ఎంఈఓలు, హెచ్ఎంలు, క్లస్టర్ హెడ్‌మాస్టర్లతో ఆయన మాట్లాడారు. PGID సూచీలో 600 మార్కులకు గాను 383 మార్కులు సాధించి, తెలంగాణలోనే ఏకైక 'ఉత్తమ్3' గ్రేడ్ సాధించిన ఏకైక జిల్లాగా జనగామ నిలవడం గర్వకారణమని, 'అవుట్‌కమ్స్' విభాగంలోనూ రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచిందని కలెక్టర్ తెలిపారు. ఇదే ఉత్సాహంతో డిజిటల్ లెర్నింగ్, గవర్నెన్స్, పాఠశాల భద్రత అంశాల్లోనూ మెరుగైన ఫలితాలు సాధించాలన్నారు.

### ప్రధాన ఆదేశాలు ఇవే..

- **డిజిటల్ లెర్నింగ్ & భద్రత :** ప్రతి పాఠశాలలో ఐసీటీ పరికరాలు, ఇంటర్నెట్, దీక్షా వేదికలను ఉపయోగించాలి. పాఠశాల భద్రతా కమిటీలు, అంతర్గత ఫిర్యాదుల కమిటీలు (ICC), పోక్సో కమిటీలను బలోపేతం చేయాలి. ప్రతి బడిలో ఫిర్యాదుల పెట్టెలు, ఈబాక్స్ అందుబాటులో ఉంచాలి.
- **విద్యార్థుల నైపుణ్యాలు :** ప్రాథమిక స్థాయిలో 'ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ' (FLN) నైపుణ్యాలైన చదవడం, రాయడం, గణిత భావనలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి. బాలికలకు స్వీయ రక్షణ శిక్షణ, ఆరోగ్య పరీక్షలు, విపత్తు నిర్వహణపై మాక్ డ్రిల్స్ నిర్వహించాలి.
- **పాలన & తనిఖీలు:** ఈఅటెండెన్స్ అమలు, యూడైస్ (UDISE+) సమాచార నమోదు, యూసీల సమర్పణ వేగవంతం చేయాలి. ప్రతి పాఠశాలను నెలకు కనీసం ఒకసారి తనిఖీ చేసి, 24 గంటల్లో నివేదికను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి. ఉపాధ్యాయులు ఏడాదికి కనీసం 50 గంటల వృత్తిపర శిక్షణ (CPD) పూర్తి చేయాలి.
- **100% విద్యార్థుల నమోదు:** బడి బయట ఉన్న పిల్లలను తిరిగి పాఠశాలల్లో చేర్పించడంతో పాటు, 10వ తరగతి పూర్తి చేసిన విద్యార్థులందరూ 100% ఇంటర్మీడియట్‌లో చేరేలా చూడాలి.

ప్రతి సూచిక సాధనకు ఒక బాధ్యతాయుత అధికారిని నియమించి, నిరంతర సమీక్షలు నిర్వహించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో విద్యా శాఖ ఏడీ శ్రీనివాస్, జీసీడీఓ గౌసియా బేగం ఇతర అధికారులు పాల్గొన్నారు.



# గ్రామసభలో ప్రజా సమస్యలపై చర్చ

## స్వచ్ఛ భారత్‌పై అవగాహన




**నర్మెట్ట, మన చౌరాస్తా :** నర్మెట్ట గ్రామ పంచాయతీ ఆవరణలో సర్పంచ్, జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు గోపగోని శ్రీధర్ గౌడ్ అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు. ఈ సభకు గ్రామానికి చెందిన ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై గ్రామాభివృద్ధి, పలు స్థానిక సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా పింఛన్‌ల పంపిణీ, విద్యుత్ సరఫరా, తపాలా సేవలు, పారిశుధ్య నిర్వహణ, తాగునీరు తదితర ప్రజా సమస్యలపై విస్తృతంగా చర్చించారు. ప్రజలు లేవనెత్తిన సమస్యలను సంబంధిత శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని సర్పంచ్ శ్రీధర్ గౌడ్ హామీ ఇచ్చారు. ఇదే సందర్భంలో గ్రామ కార్యదర్శి మొహమ్మద్ నాసర్ స్వచ్ఛ భారత్ మిషన్ కార్యక్రమం కింద అవగాహన కల్పిస్తూ తడి చెత్త, పొడి చెత్త, గృహ ప్రమాదకర వ్యర్థాలు, శానిటరీ వ్యర్థాలను వేర్వేరుగా సేకరించడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ప్రతి ఇంటి నుంచే చెత్తను వేరు చేసి అందించడం ద్వారా పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన నర్మెట్ట గ్రామ నిర్మాణానికి సహకరించాలని కోరారు. అనంతరం సర్పంచ్ శ్రీధర్ గౌడ్ మాట్లాడుతూ సమష్టి సహకారంతోనే గ్రామాభివృద్ధి సాధ్యమవుతుందని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి అర్హులైన లబ్ధిదారునికి చేరేలా కృషి చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కొలపాక స్వామి, గ్రామ కార్యదర్శి మొహమ్మద్ నాసర్, వార్డు సభ్యులు, కారోబార్లు, పారిశుధ్య కార్మికులు, వివిధ శాఖల అధికారులు, అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు మరియు గ్రామ పెద్దలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# విద్యా ప్రమాణాలపై శ్రద్ధ వహించాలి

## కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**దేవరుప్పుల, మన చౌరాస్తా :** పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెంపుతో పాటు అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల పోషణ, పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. బుధవారం దేవరుప్పుల మండలం నీర్మాల గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను, అంగన్‌వాడీ కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా 2వ తరగతి విద్యార్థులకు ఉచిత ఏకరూప దుస్తులను పంపిణీ చేసిన కలెక్టర్, పిల్లలతో ముచ్చటించి వారి చదువు, గణిత పరిజ్ఞానాన్ని పరిశీలించారు. విద్యార్థుల్లో ఆసక్తి పెంపొందించేలా బోధన సాగాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి, చిన్నారులకు పరిశుభ్రమైన, నాణ్యమైన పోషకాహారాన్ని అందించాలని, ప్రతి చిన్నారి ఆరోగ్యం, ఎదుగుదలపై దృష్టి పెట్టాలని ఆదేశించారు. ఈ తనిఖీలో సర్పంచ్ సంధ్యారాణి, పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.





# ప్రత్యామ్నాయ పంటలతోనే రైతులకు అధిక ఆదాయం

## కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**దేవరుప్పుల, మన చౌరాస్తా :** వాతావరణ మార్పులు, భూగర్భ జలాల పరిరక్షణను దృష్టిలో ఉంచుకొని రైతులు అధిక నీరు అవసరమయ్యే వరి సాగుకు ప్రత్యామ్నాయంగా తక్కువ నీటితో లాభాలు ఇచ్చే పంటలను సాగు చేయాలని జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సూచించారు. బుధవారం దేవరుప్పుల మండలం నీర్మాల గ్రామానికి చెందిన ప్రగతిశీల రైతు నరేందర్ రెడ్డి వ్యవసాయ క్షేత్రాన్ని కలెక్టర్ అధికారులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా రైతు సాగు చేస్తున్న మల్బరీ, పట్టుపురుగుల పెంపకం, ఆయిల్ పామ్, మునగ పంటలను కలెక్టర్ పరిశీలించారు. డ్రిప్ ఇరిగేషన్ వినియోగం, మొక్కల మధ్య దూరం, పద్ధతులు మరియు మార్కెటింగ్ అవకాశాలపై రైతును అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, అధిక నీరు పట్టే పంటల కంటే నువ్వులు, కందులు, పెసర్లు, మినుములు, కుసుమ, ఆముదం వంటి పంటలను విస్తృతంగా సాగు చేయాలని కోరారు. పంటల వైవిధ్యీకరణ, ఆధునిక సూక్ష్మ నీటిపారుదల పద్ధతులు పాటించడం ద్వారా సాగు ఖర్చులు తగ్గి ఆదాయం పెరుగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డీఏఓ అంబికా సోని, ఎంఏఓ మనోహిత్, ఏఈఓ సాయి కిరణ్, గ్రామ సర్పంచ్ సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.



# కొత్తపల్లిలో ఘనంగా తల్లిపాల వారోత్సవాలు

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** భీమదేవరపల్లి మండలం కొత్తపల్లి గ్రామ అంగన్వాడీ కేంద్రంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీడీపీఓ దుగ్యాల స్వరూపరాణి మాట్లాడుతూ, తల్లిపాలు శిశువుకు ప్రకృతి ప్రసాదించిన సంపూర్ణ ఆహారమని పేర్కొన్నారు. పుట్టిన గంటలోపే శిశువుకు తల్లిపాలు ఇవ్వడం ద్వారా రోగనిరోధక శక్తి పెరుగుతుందని, తొలి ఆరు నెలల పాటు కేవలం తల్లిపాలే అందించడం వల్ల శిశువు ఆరోగ్యవంతంగా ఎదుగుతాడని వివరించారు. తల్లిపాలు శిశువును అనేక అంటువ్యాధుల నుంచి రక్షించడంతో పాటు తల్లి ఆరోగ్యానికీ మేలు చేస్తాయని చెప్పారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందిస్తున్న పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి కుటుంబ సభ్యుల సహకారం అవసరమని, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం, విశ్రాంతి, వైద్య సేవలు అందించడం ప్రతి కుటుంబం బాధ్యత అని అన్నారు. గ్రామ సర్పంచ్ సిక ప్రదీప్ మాట్లాడుతూ, ప్రతి తల్లి తల్లిపాల ప్రాముఖ్యతను గుర్తించి శిశువులకు తప్పనిసరిగా తల్లిపాలు అందించాలని కోరారు. గ్రామంలో గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు గ్రామపంచాయతీ ఎల్లప్పుడూ సహకరిస్తుందని తెలిపారు. గ్రామ వైద్యులు డాక్టర్ దినేష్ మాట్లాడుతూ, తల్లిపాలు శిశువు మెదడు ఎదుగుదల, శారీరక వికాసం, రోగనిరోధక శక్తి పెంపుదలకు ఎంతో కీలకమని చెప్పారు. తల్లిపాలు ఇచ్చే తల్లుల్లో ఆరోగ్య సమస్యలు తగ్గడంతో పాటు తల్లి-శిశువు మధ్య అనుబంధం మరింత బలపడుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ ఉపాధ్యాయులు, ఆయాలు, ఆశా కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు, గ్రామస్థులు పాల్గొని తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన పొందారు.



## సైబర్ నేరాల నివారణలో ప్రతి ఒక్కరూ

# భాగస్వాములు కావాలి

**మహబూబాబాద్ ఎస్పీ శబరీష్**




**మహబూబాబాద్, మన చౌరాస్తా :** సైబర్ నేరాల నివారణకు సమాజంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, ముఖ్యంగా ప్రతి ఉద్యోగికీ సైబర్ భద్రతపై సమగ్ర అవగాహన ఉండాలని మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డా. శబరీష్, ఐపీఎస్ పిలుపునిచ్చారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో స్వాతంత్ర్య మహోత్సవాల సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న "సురక్షా కా తిరంగా - సైబర్ స్వతంత్ర తెలంగాణ" అవగాహన ప్రచారంలో భాగంగా మహబూబాబాద్ జిల్లా సైబర్ క్రైమ్ విభాగం ఆధ్వర్యంలో ప్రభుత్వ మెడికల్ కళాశాలలో విద్యార్థులకు, అధ్యాపకులకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ఎస్పీ అవగాహన పోస్టర్లను ఆవిష్కరించి, సదస్సులో పాల్గొన్న వారితో సైబర్ భద్రత ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం సైబర్ భద్రత, డిజిటల్ సెక్యూరిటీ, ఆన్‌లైన్ మోసాల నివారణపై ఎస్పీ మాట్లాడుతూ, ప్రస్తుతం నమోదవుతున్న సైబర్ నేరాల్లో దాదాపు 30 శాతం ఇన్వెస్ట్‌మెంట్ మోసాలే ఉన్నాయని తెలిపారు. ప్రధానంగా ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు మరియు ఆర్థికంగా స్థిరపడిన వారిని లక్ష్యంగా చేసుకుని నేరగాళ్లు ఉచ్చు బిగిస్తున్నారని పేర్కొన్నారు. ప్రజల ఆన్‌లైన్ అలవాట్లు, సోషల్ మీడియా వినియోగాన్ని విశ్లేషించి వారిని మోసగిస్తున్నారని హెచ్చరించారు. ఇటీవల జిల్లాలో ఒక రిటైర్డ్ ఉపాధ్యాయుడు డిజిటల్ అరెస్ట్ మోసంలో భారీ మొత్తంలో డబ్బు కోల్పోగా, జిల్లా సైబర్ సెల్ సకాలంలో స్పందించి ఆ మొత్తాన్ని తిరిగి బాధితుడికి అందజేసిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు. బ్యాంక్‌లో డబ్బులు ఉండటమే భద్రత కాదని, ఆన్‌లైన్‌లో ప్రతి అడుగులోనూ అప్రమత్తంగా ఉండటమే నిజమైన భద్రత అని, మొబైల్ ఫోన్‌కు వచ్చే ప్రతి కాల్, మెసేజ్, లింక్ లేదా పెట్టుబడి ఆహ్వానాన్ని ఒకటికి రెండుసార్లు పరిశీలించిన తర్వాతే స్పందించాలని సూచించారు. ముఖ్యంగా ఎవరైనా "ఈ విషయం ఎవరికీ చెప్పొద్దు" అని ఒత్తిడి తెస్తే అది ఖచ్చితంగా సైబర్ మోసానికి సంకేతమని గ్రహించాలని స్పష్టం చేశారు. జిల్లా సైబర్ సెల్ ఇన్‌స్పెక్టర్ నరేష్ మాట్లాడుతూ, వేగంగా పెరుగుతున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI) సాంకేతికత వల్ల డీప్‌ఫేక్ వాయిస్, వీడియో కాల్స్ ద్వారా బంధువులు, ఉన్నతాధికారుల పేర్లతో మోసాలు చేసే ప్రమాదం ఉందన్నారు. అత్యవసరంగా డబ్బులు పంపాలని వచ్చే సందేశాలు, కాల్స్ నిజానిజాలను నిర్ధారించుకున్న తర్వాతే ముందడుగు వేయాలని సూచించారు. స్టాక్ మార్కెట్, ఓటీపీ కేవైసీ, ఫేక్ లింకులు, సోషల్ మీడియా మోసాల పట్ల విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని, ఈ సమాచారాన్ని సమాజంలోకి విస్తృతంగా తీసుకెళ్లాలని కోరారు. ఆన్‌లైన్‌లో మోసపోయిన బాధితులు వెంటనే 1930 హెల్ప్‌లైన్ నంబర్‌కు లేదా అధికారిక సైబర్ క్రైమ్ వెబ్‌సైట్ ద్వారా పోలీసులను సంప్రదించాలని తెలిపారు.



## కవి పొట్లబత్తిని భాస్కర్ మృతి

# సాహిత్య లోకానికి తీరని లోటు

**జనగామ, మన చౌరాస్తా :** కవి, ఉపాధ్యాయుడు పొట్లబత్తిని భాస్కర్ అకాల మృతి సాహిత్య లోకానికి తీరని లోటని జనగామ కవులు, కళాకారుల ఐక్యవేదిక తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. బుధవారం సాయంత్రం జనగామ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద కవులు, కళాకారులు కొవ్వొత్తులతో ఆయనకు ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. శ్రీనివాస నగర్ కాలనీకి చెందిన ప్రముఖ తెలుగు భాషా ఉపాధ్యాయుడు, జనగామ రచయితల సంఘం పూర్వ అధ్యక్షుడు అయిన పొట్లబత్తిని భాస్కర్ కళా, సాహిత్య, విద్యా రంగాల్లో చేసిన కృషి ఎనలేనిదన్నారు. సమాజ హితం కోరి ఆయన ఎన్నో అద్భుతమైన వచన కవితలు రాశారని కొనియాడారు. ఆయన విడిచిపెట్టిన ఆశయాలను, ఆశ్రయించిన సాహిత్య విలువలను కవులు, కళాకారులు ముందుకు తీసుకుపోవడమే ఆయనకు మనం ఇచ్చే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ఈ నివాళి కార్యక్రమంలో జి.కృష్ణ, పెట్లోజు సోమేశ్వరాచారి, అయిలా సోమనర్సింహాచారి, లగిశెట్టి ప్రభాకర్, డా.వేముల సదానందం, పానుగంటి రామమూర్తి, సాంబరాజు యాదగిరి, కొడం కుమారస్వామి, గడ్డం మనోజ్ కుమార్, మసురం రాజేంద్ర ప్రసాద్, రంగరాజు ప్రసాద్, మాన్యపు భుజేందర్, కృష్ణమాచార్యులు, గూటం రమేష్, చాపల మహేందర్, జోగు సుదర్శన్,టి.రామచంద్రం ,అజహరుద్దిన్ తదితరులు పాల్గొని భాస్కర్ ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు.



# యుగంధర్ యాదవ్‌కు ఘన సన్మానం

**మహబూబాబాద్, మన చౌరాస్తా :** దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ (SCRMU) వరంగల్ బ్రాంచ్ సెక్రెటరీ యుగంధర్ యాదవ్ SCRMU జోనల్ వర్కింగ్ కమిటీ సభ్యుడిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా మహబూబాబాద్ మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్ ఆయనను శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. రైల్వే ఉద్యోగుల హక్కుల పరిరక్షణకు, సమస్యల పరిష్కారానికి నిరంతరం శ్రమిస్తున్న యుగంధర్‌కు జోనల్ స్థాయిలో కీలక బాధ్యతలు దక్కడం అభినందనీయమని శంకర్ నాయక్ కొనియాడారు. ఈ నియామకంపై స్పందించిన యుగంధర్ యాదవ్... తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన యూనియన్ నాయకత్వానికి, అభినందించిన మాజీ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలుపుతూ, భవిష్యత్‌లో ఉద్యోగుల సంక్షేమం కోసం మరింత బాధ్యతాయుతంగా పనిచేస్తానని చెప్పారు.





# జనగామలో సైబర్ నేరాలపై అవగాహన సదస్సు

**జనగామ, మన చౌరాస్తా :** వరంగల్ పోలీస్ కమిషనర్ స్వేత ఐపీఎస్ ఆదేశాల మేరకు, జనగామ పోలీసుల ఆధ్వర్యంలో స్థానిక ఇంటిగ్రేటెడ్ డిస్ట్రిక్ట్ ఆఫీసెస్ కాంప్లెక్స్ (IDOC) లో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జనగామ ఏసీపీ భీమ్ శర్మ పర్యవేక్షణలో జరిగిన ఈ సదస్సులో సీఐ సత్యనారాయణ రెడ్డి, సైబర్ క్రైమ్ ఎస్ఐ, పోలీసు సిబ్బంది పాల్గొని ఐడీఓసీలోని వివిధ శాఖల అధికారులు, సిబ్బందికి సైబర్ భద్రతపై అవగాహన కల్పించారు. ప్రస్తుతం వ్యాపిస్తున్న డిజిటల్ అరెస్ట్, ఓటీపీ మరియు బ్యాంకింగ్ మోసాలు, ఫిషింగ్ లింకులు, నకిలీ పెట్టుబడి పథకాలు, సోషల్ మీడియా మోసాల గురించి ఈ సందర్భంగా పోలీసులు వివరంగా వెల్లడించారు. సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలను వివరించారు. ఒకవేళ ఎవరైనా సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని లేదా జాతీయ సైబర్ క్రైమ్ పోర్టల్ ద్వారా నమోదు చేయాలని సూచించారు. సైబర్ నేరాల నివారణలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉంటూ, ప్రజల్లో కూడా అవగాహన పెంపొందించాలని అధికారులు పిలుపునిచ్చారు.

## పోలీస్ అసోసియేషన్ ఎన్నికల్లో నరేష్ విజయం



**పాలకుర్తి, మన చౌరాస్తా :** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పోలీస్ అసోసియేషన్ పాలకుర్తి సర్కిల్ ఎన్నికల్లో కానిస్టేబుల్ బొజ్జా నరేష్ విజయం సాధించారు. CP శ్వేత ఆదేశాల మేరకు పాలకుర్తి, కొడకండ్ల, దేవరుప్పుల పోలీస్ స్టేషన్లలో పాలకుర్తి సర్కిల్ ఇన్స్పెక్టర్ జానకిరామ్ రెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల్లో ముగ్గురు సిబ్బంది బరిలో నిలవగా అత్యధిక మెజార్టీతో పాలకుర్తి కానిస్టేబుల్ బొజ్జా నరేష్ గెలుపొందారు. ఉన్నతాధికారులు అధికారులు అభినందించారు. పాలకుర్తి సబ్ ఇన్స్పెక్టర్ దూలం పవన్ కుమార్, దేవరుప్పుల సబ్ ఇన్స్పెక్టర్ సృజన్ కుమార్, కొడకండ్ల సబ్ ఇన్స్పెక్టర్ చింతరాజు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# కొరియన్ కనకరాజు విడుదలకు రెడీ

మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ హీరోగా నటించిన ఇండో`కొరియన్ హారర్ కామెడీ 'కొరియన్ కనకరాజు'

విడుదలకు సిద్ధమైంది. దర్శకుడు మేర్లపాక గాంధీ తెరకెక్కించిన ఈ చిత్రంలో రితికా నాయక్ హీరోయిన్‌గా నటించగా, ప్రముఖ కమెడియన్ సత్య కీలక పాత్ర పోషించారు. ఆగస్టు 7న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న ఈ సినిమా ఇప్పటికే సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకుంది. ఈ నేపథ్యంలో సినిమా చూసిన వారి ఒపీనియన్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో ఆసక్తికరంగా మారాయి. ముఖ్యంగా కామెడీ, వరుణ్ తేజ్ నటన, థమన్ సంగీతం సినిమాకు ప్రధాన బలాలుగా నిలిచాయని టాక్ వినిపిస్తోంది. 'వెంకటాద్రి ఎక్స్‌ప్రెస', 'ఎక్స్‌ప్రెస్ రాజా' వంటి విజయవంతమైన కామెడీ చిత్రాలను తెరకెక్కించిన మేర్లపాక గాంధీ, మరోసారి తన మార్క్ కామెడీని ఈ చిత్రంలో చూపించినట్లు సమాచారం. సినిమా తొలి భాగం నుంచి రెండో భాగం వరకు పలు కామెడీ సన్నివేశాలు ప్రేక్షకులను కడుపుబ్బా నవ్విస్తాయని సెన్సార్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ముఖ్యంగా ఇంటర్వెల్ ముందు, తర్వాత వచ్చే ఎపిసోడ్లు బాగా వర్కవుట్ అయ్యాయని అంటున్నారు. అలాగే వరుణ్ తేజ్, సత్య మధ్య వచ్చే కామెడీ ట్రాక్‌తో పాటు బుల్లిరాజు పాత్ర చుట్టూ తిరిగే సన్నివేశాలు కూడా మంచి వినోదాన్ని అందిస్తాయని సమాచారం. సినిమాలో వరుణ్ తేజ్ రెండు విభిన్న కోణాలు ఉన్న పాత్రలో కనిపించనున్నట్లు తెలుస్తోంది. అనంతపురం జిల్లా పెనుగొండకు చెందిన సాధారణ యువకుడు కనకరాజు పాత్రలో ఒకవైపు కనిపిస్తే, మరోవైపు కొరియన్ గ్యాంగ్‌స్టర్ ఆత్మ ఆవహించిన తర్వాత పూర్తిగా భిన్నమైన వ్యక్తిత్వంతో కనిపించనున్నారని టాక్.ఈ రెండు పాత్రల మధ్య బాడీ లాంగ్వేజ్, డైలాగ్ డెలివరీ, స్టైల్ పరంగా వరుణ్ తేజ్ మంచి వేరియేషన్ చూపించారని సినిమా చూసిన వారు చెబుతున్నారు. కంటెంట్‌కు ప్రాధాన్యం ఇచ్చే వరుణ్ తేజ్ ఈసారి కమర్షియల్ ఎంటర్‌టైనర్‌లో కూడా తన నటనతో ఆకట్టుకున్నారని సమాచారం. సినిమా కథ ఆసక్తికరమైన కాన్సెప్ట్‌తో రూపొందినట్లు తెలుస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లోని కియా కంపెనీలో ఉద్యోగం కోసం కొరియా నుంచి వచ్చిన యువతి పాత్రలో రితికా నాయక్ కనిపించనుంది. ఆమెను ప్రేమించే కనకరాజు జీవితంలో అనుకోని మలుపు తిరుగుతుంది. కొరియా నుంచి వచ్చిన ఓ బాటిల్‌లో బంధించబడిన గ్యాంగ్‌స్టర్ ఆత్మ బయటకు వచ్చి కనకరాజును ఆవహిస్తుంది. ఆ తర్వాత కనకరాజు జీవితం ఎలా మారింది? ఆ ఆత్మ కొరియాతో ఉన్న సంబంధం ఏమిటి? చివరకు కథ ఎలాంటి మలుపు తిరిగింది? అనే అంశాల చుట్టూనే సినిమా సాగుతుందని తెలుస్తోంది. సినిమాకు సంగీత దర్శకుడు ఎస్. థమన్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, పాటలు కథకు మరింత బలం చేకూర్చాయని సమాచారం. కామెడీ తర్వాత ఎక్కువ ప్రశంసలు సంగీతానికే వస్తాయని సినీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది.




Printed and Published by **UPPALANCHI POORNIMA** on behalf of UPPALANCHI POORNIMA, Printed at Hamara Warangal Printers and Graphics H.no.25-8-182, Balaji Nagar, Kazipet, Warangal, 506003., Published at H.No.4-8-65, Dharmakancha, Jangaon, Jangaon District. Telangana, 506167, Editor : **UPPALANCHI NARENDER**. Ph : **8555800812**, RNI : **TGTEL/25/A4350**